సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 7 । ఆగస్టు । 2025



గిరిజన రైతుల హక్కులు కాలరాస్తే సహించం

- 8లో

గిరిజన రైతుల హక్కులు కాలరాస్తే సహించేది లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు హెచ్చరించారు.



పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పీఏసీఎస్‌లలో నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

- 8లో



ఉపాధికోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- 8లో

ఉపాధికోసం వెళ్లిన యువకుడు ప్రమాదంలో దుర్మరణం చెందాడు.

న్యూస్‌రీల్

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రాస్పత్రిలో గురువారం క్యాన్సర్‌కు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో జిల్లా ఆస్పత్రిలో ఉచిత స్క్రీనింగ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొంటూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 7వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత స్క్రీనింగ్ జరుగుతుందని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్త్రీ, పురుషులకు విభాగాల్లో నిర్వహిస్తారని ముఖ్యంగా, స్త్రీలకు గైనిక్, రొమ్ము, గర్భాశయ, ఇతర క్యాన్సర్‌లకు స్క్రీనింగ్ చేయనున్నారని పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



చోళపదంలో అగ్రిగోల్డ్ భూములు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొమరాడ: మండలంలోని చోళపదం, ఉలిపిరి గ్రామాల్లోని అగ్రిగోల్డ్ భూములను పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ సంబంధిత కమిటీ సభ్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. కొమరాడ తహసీల్దార్ సత్యనారాయణ భూముల పరిస్థితిని వివరించారు. మూడు ఎల్‌పీఎంలలో దాదాపు తొమ్మిది వందల చెట్లను లెక్కించామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మ్యుటేషన్, చెట్లగణన త్వరగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక సంబంధిత అధికారులను ఆదేశించారు.

పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సరెండర్



కమిషనర్ వెంకటేశ్వర్లు

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మేనేజర్ హోదా గల ఆయన.. కూటమి నేతలతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా పుర కమిషనర్‌గా చలామణి అవుతున్న విషయం విదితమే. కూటమి ప్రభుత్వంపై స్వామి భక్తి చాటుకోవడమే కాక.. అవినీతి అధికారిగానూ ముద్ర పడ్డారు. పుర పాలకవర్గం విషయంలో ప్రోటోకాల్ పాటించకుండా, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకూ ఆహ్వానించక, కౌన్సిల్ సమావేశాల్లో కూటమి నేతలకు అనుకూలంగా ఉంటూ, ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు.. ప్రతి పనికీ ఒక రేటు కట్టేశారని, సొంత ఉద్యోగులను సైతం వదలకుండా ఇబ్బంది పెట్టేవారిని బహిరంగంగానే విమర్శలు వచ్చాయి. కొన్నాళ్లుగా కమిషనర్ వెంకటేశ్వర్లుకు.. మున్సిపల్ ఉద్యోగులకు మధ్య యుద్ధమే సాగింది. దీనిపై ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యేతో పాటు, కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఇటీవల కార్యాలయానికి వచ్చిన మున్సిపల్ ఆర్డీకి కూడా పురపాలక సంఘం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ సభ్యులతో పాటు పలువురు పట్టణ వాసులు కమిషనర్ తీరుపై ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఆయనను సరెండర్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. తదుపరి పోస్టింగ్ కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయానికి నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

133 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకిత సురానా

సాలూరు రూరల్: గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో బుధవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 133 కేజీల గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ఏఎస్పీ అంకిత సురానా తెలిపారు. ఈ మేరకు ఆమె సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. పాచిపెంట మండలం మాతుమూరు సమీపంలో వేటగాని వలస గ్రామం గ్రీన్‌ఫీల్డ్ జంక్షన్ వద్ద పోలీసులు గంజాయితో పాటు నిందితులను పట్టున్నట్లు తెలిపారు.

ఈ కేసులో ఆటోతోపాటు ఇద్దరు నిందితులు కొర్ర డానియల్, జన్ని దివాకర్‌లను అరెస్టు చేశామన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో రూరల్ ఎస్సై నరసింహమూర్తి, పాచిపెంట ఎస్సై పాల్గొన్నారు.

మన్యం ప్రజల దారిద్ర్యం

- అధ్వానంగా గిరిజన గ్రామాల రోడ్లు
- రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్లాలంటే ఇబ్బందులే..
- అటవీ ఉత్పత్తులు తరలించేందుకు అగచాట్లు
- సీతంపేట ఐటీడీఏ పరిధిలో సుమారు 120 గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు



చిత్రంలో కనిపిస్తున్నది ఏదో నీరు ప్రవహించిన తర్వాత ఎండిన గెడ్డ అనుకుంటే పొరపాటే. ఇది సీతంపేట మండలంలోని ఎగువదరబ రోడ్డు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాళ్లుతేలిపోయింది. దీనిపై ప్రయాణించేందుకు ఈ ప్రాంత గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచివెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. రోడ్డు బాగుచేయాలని పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.



చిత్రంలో అసంపూర్తిగా కనిపిస్తున్నది కొండాడ నుంచి మేడ ఒబ్బంగికి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటి 50 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ సుమారు రూ.45 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. ఇంతలో ప్రభుత్వం మారిపోవడంతో ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై రాకపోకలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నారు.



గోతులమయమైన పెదరామకు వెళ్లే రోడ్డు

సీతంపేట:

మన్యం ప్రజలను 'దారి'ద్ర్యం వెంటాడుతోంది. సరైన 'మార్గం' చూపేవారు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు అగచాట్లు ఎదుర్కొంటున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 1250కు పైగా గిరిజన గ్రామాలున్నాయి. వీటిలో పూర్తిగా రహదారులు లేని గ్రామాలు 120కి పైగా ఉన్నాయి. అలాగే ఛిద్రమైన దారులు 100కు పైగా ఉంటాయ ని అంచనా. అటవీశాఖ అభ్యంతరాలతో కొన్ని గ్రామాలకు రోడ్లు వేయలేని పరిస్థితి. ఏజెన్సీలో ఉన్న రోడ్లు అధ్వానంగా మారడం, కొత్తరోడ్లు వేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవచూపకపోవడంతో రాకపోకలకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో 108 వాహన సేవలు అందక డోలీలోనే రోగులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. కనీసం గత ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్లనైనా పూర్తిచేయాలని ప్రాథేయపడుతున్నా పట్టించుకోకపోవడంపై గిరిజన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాడైన రోడ్లపై ప్రయాణ కష్టాలు..

- కోపువలస నుంచి సందిగూడ వయా వంబరెల్లికు కొత్త రోడ్డు నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు రూ.3 కోట్లు మంజూరైనా పనులు మాత్రం జరగలేదు. ఆ ప్రాంత ప్రజలకు రోడ్డు కష్టాలు తప్పడంలేదు.
- కోదులవీరఘట్టం, దాసుపరం, అంబలగండి గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గుడ్డిమీద గూడ మీదుగా కడగండి వెళ్లే రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- కొత్తారింగు–తాళ్లబద్రకు రహదారిలేకపోవడంతో రెండు రోజుల కిందట ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలించేందుకు గిరిజనులు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు వచ్చి న అంబులెన్స్ బురదలో కూరుకుపోయింది. స్థానికుల సాయంతో అతికష్టం మీద అంబులెన్స్‌ను తీశారు.
- తుంబలి, చావిడివలస తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడయ్యాయి. ముకుందాపురం రోడ్డు పనులు ప్రారంభించి వదిలేశారు. ఎగువద్వారబంధం గ్రామానికి వేసిన రోడ్డు నాణ్యతలేక వర్షాలకు కొట్టుకుపోయిందని గిరిజనులు వాపోతున్నారు. పొంజాడ–ఆడలి రహదారిదీ ఇదే పరిస్థితి. శిలిగాం నుంచి ఈతమానుగూడ రోడ్డుపై రాళ్లు తేలాయి. దబర నుంచి దబరగూడకు రోడ్డు నిర్మాణమే జరగలేదు.

రోడ్ల పనుల్లో అలసత్వం తగదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పూర్తిచేయలేదు. సీతంపేట ఏజెన్సీలో 10 రోడ్ల నిర్మాణానికి ఏడాదిన్నర కిందట రూ.13.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అంతకముందు మరో 20 రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనా వాటి పనులు ఇప్పటికీ పూర్తిచేయలేదు. కొత్త రోడ్లు మంజూరు ఎలాగూలేదు. కనీసం అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తిచేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే

రోడ్ల నిర్మాణానికి చర్యలు



రోడ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లు లేని పలు గ్రామాలకు కొత్తగా రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– కుమార్, ఈఈ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్‌శాఖ

ప్రయాణించేందుకు భయపడుతున్నాం



వీలైనంత తొందరగా రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి. రాళ్లుతేలిన, గోతులమయమైన రోడ్లపై ప్రయాణానికి ప్రతి నిత్యం భయపడుతున్నాం. కష్టాలు అనుభవిస్తున్నాం. మేడ ఒబ్బంగికి వెళ్లాలన్నా, రావాలన్నా నరకం చూస్తున్నాం. కొండశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించాలి.

– ఎస్.ముకుందరావు, సర్పంచ్, కొండాడ

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి



రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులతో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- రెడ్ క్రాస్ నూతన కార్యవర్గం ఎన్నిక

పార్వతీపురం రూరల్: జిల్లాలో నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు చిత్తశుద్ధితో తమ సేవలను ప్రజలకు అందించాలని రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా రెడ్‌క్రాస్ నూతన అధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ సేవలు విస్తరింపజేయాలన్నారు. ప్రతి మండలంలోనూ సభ్యత్వ నమోదుచేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో మలేరియా, ఎనీమియా, సికిల్‌సెల్ బాధితుల వివరాలు నమోదు చేయాలని, వారికి అవసరమైన మందులు, బలవర్థకమైన ఆహారం రెడ్‌క్రాస్ నుంచి అందేలా చూడాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం, చదువుకునే పిల్లలకు రెడ్‌క్రాస్ సంస్థ తరఫున సాయం అందించాలని సూచించారు. జిల్లాలో రక్తం నిల్వలు పెంచేందుకు కృషిచేయాలని కోరారు. రెడ్‌క్రాస్ సంస్థకు నగరంలో ప్రభుత్వ భవనం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో రెడ్‌క్రాస్ కమిటీ ఉండాలని, నెల లేదా మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించాలన్నారు.

కార్యవర్గం ఇదే..

రెడ్‌క్రాస్ చైర్మన్‌గా డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శిగా బి.నాగభూషణరావు, కోశాధికారిగా పెంటపాటి సూర్యారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ జనార్దనరావు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం జోరు.. జనం బేజారు!



ఇప్పుడు ఏ పల్లె, పట్టణం, వీధిలో అయినా మద్యం విచ్చలవిడిగా లభిస్తోంది. బహిరంగ మద్యపానం యథేచ్ఛగా సాగుతోంది. ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో చిచ్చుపెడుతోంది. వివాదాలకు కారణంగా మారుతోంది. వీటిని కట్టడిచేసేందుకు పోలీసులు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రోన్ కెమెరాలతో పలు ప్రాంతాలను చిత్రీకరించగా టీబీఆర్ థియేటర్ ప్రాంతంలో కాలువ గట్టుపై బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని గుర్తించారు. వెంటనే పోలీసులను పంపించి వారిని పట్టుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం సేవించి వాహనాలను నడిపినా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

– బొబ్బిలి

13 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

విజయనగరం అర్బన్: విధులు సకాలంలో నిర్వహించలేదనే ఆరోపణపై జిల్లాలోని 13 మంది సచివాలయ సిబ్బందికి బుధవారం షోకాజ్ నోటీసులను జిల్లా అధికారులు జారీ చేశారు. నిర్దేశించిన రోజుల్లో చేపట్టాల్సిన వివిధ సేవలపై ప్రచారం, వర్క్ ఫ్రమ్ హోం సర్వే, పీ–4 మార్గదర్శకుల సేకరణ వంటి విధులను సకాలంలో నిర్వహించలేదని నోటీస్‌లో కారణం చూపారు. దీనిపై సచివాలయ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. పింఛన్ల పంపిణీతో పాటు వివిధ ప్రభుత్వ సర్వేలతో తీరిక లేకుండా పనిచేస్తుంటే నోటీసులు ఇవ్వడం ఎంతమేర సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌లో భాగస్వామ్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖధికారి బి.రాజ్‌కుమార్

పార్వతీపురం టౌన్: ఇన్‌స్పైర్ మనక్‌లో జిల్లాలోని అన్ని పాఠశాలలు భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖధికారి బి.రాజకుమార్ తెలియజేశారు. ఇన్‌స్పైర్ మనక్ 2025–26కు గాను డివిజనల్ లెవెల్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం స్థానిక డీవీఎంఎం ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలు వెలికితీయవచ్చని, నిజజీవిత సమస్యలకు పరిష్కారం కనుగొనేలా ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ప్రాజెక్టులు నామినేషన్ అయ్యేలా అందరు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జాతీయస్థాయికి వెళ్లేలా ప్రాజెక్టులు సిద్ధం చేయించాలన్నారు. ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్‌ల నామినేషన్లకు సెప్టెంబర్ 15 చివరి తేదీ అని అంతకు ముందుగానే ప్రాజెక్ట్ సబ్‌మిట్ చేయాలని సాంకేతిక సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, డివిజన్‌లో అన్ని మేనేజ్మెంట్ పాఠశాల నుంచి ఉపాధ్యాయులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పెంట రామకృష్ణ, స్థానిక పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, ఏఎస్ఓ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నడైనా చూశామా?

- కలెక్టర్ల పనితీరుపై సర్వే
- కొద్దిరోజులుగా మోత మోగుతున్న ఐవీఆర్ఎస్ కాల్స్
- అధికారులు, రాజకీయ నాయకులు ఒకటేనా? అని ప్రశ్నిస్తున్న ఉద్యోగ సంఘాలు


సాక్షి, పార్వతీపురం మన్యం:

గత ఎన్నికలకు ముందు.. 'మీరు ఏ పార్టీ అభ్యర్థికి ఓటేస్తున్నారు' అంటూ ఓ సర్వే... వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన.. అనే ఆప్షన్లు!



కూటమి అభ్యర్థిగా మీరు ఎవరిని కోరుకుంటున్నారు.. అంటూ ఇంకో సర్వే.. ఓ మూడు, నాలుగు పేర్లు!

ఎన్నికల్లో గెలిచిన తర్వాత, నామినేటెడ్ పదవుల భర్తీ నిమిత్తం.. 'మీ ప్రాంతంలో పార్టీ కోసం బాగా కష్టపడుతున్న వ్యక్తి ఎవరు?' అని మరో సర్వే!!



కలెక్టర్ల పనితీరుపై సర్వేకు ఈ ఫోన్ నంబర్‌తోనే వస్తున్న కాల్స్

అభ్యర్థుల గెలుపోటములు, ఎంపికలు, విజయావకాశాలు... సాంకేతికత అభివృద్ధి చెందిన తర్వాత ఇలా వివిధ సర్వేలను రాజకీయ పార్టీలు నిర్వహించడం సాధారణం అయిపోయింది. ఇందుకు భిన్నంగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం మరో సర్వే చేపడుతోంది. 'మీ కలెక్టర్ పని తీరు ఎలా ఉందంటూ'.. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఐవీఆర్ఎస్ కాల్స్ మోత మోగుతున్నాయి. మీ కలెక్టర్ పని తీరు పట్ల సంతృప్తిగా ఉన్నారా? అంటూ రికార్డెడ్ కాల్ వాయిస్ వస్తోంది. కొద్దిరోజులుగా కలెక్టర్ల బదిలీలు ఉంటాయన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇటువంటి సర్వే నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

కలెక్టర్లు.. రాజకీయ నాయకులు ఒక్కటేనా?

జిల్లా కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించి ఏడాది అయ్యింది. ఇదే సమయంలో ఆయన బదిలీపై త్వరలో వెళ్లిపోనున్నారన్న ప్రచారం ఉంది. సాధారణంగా ఏ జిల్లాలో అయినా కలెక్టర్లు రెండేళ్లు మించి పని చేయరు. ప్రభుత్వాలు మారినప్పుడు తమకు అనుకూలమైన ఐఏఎస్‌లను తెచ్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అంతేగానీ.. రాజకీయ నాయకుల మాదిరిగా సర్వేల ద్వారా కలెక్టర్ల పనితీరును తెలుసుకోవడం మునుపెన్నడూ లేదు. దేశంలోనే అత్యున్నత సర్వీసు అయిన కలెక్టర్ పోస్టు అంటే అందరికీ గౌరవమే. జిల్లా మేజిస్ట్రేట్‌గా, ఆ జిల్లాకు ఉన్నత అధికారిగా అన్ని అధికారాలూ ఉంటాయి. అటువంటి వారిని తప్పు పట్టేలా, చిన్నబుచ్చుకునేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి విధానాన్ని ఎప్పుడూ చూడలేదని ఉద్యోగవర్గాలు అంటున్నాయి. ఏ చదువూ అర్హత లేని రాజకీయ నాయకుడు.. ఉన్నత చదువులు చదివిన కలెక్టర్ ఒక్కటేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం తీరుపై ఉద్యోగ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. తమకు ఇస్తామన్న బకాయిలు ఏవీ చెల్లించడం లేదు సరికదా.. వివిధ సర్వేలు, ఇతర పనులు అంటూ పని భారం మోపుతున్నాయన్న ఆవేదనలో ఉన్నారు. దీనికి తోడు బంగారు కుటుంబాలు అని కొన్ని పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. ఇలా ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఆయా సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం మొండిగానే ముందుకు వెళ్తోంది.

క్లుప్తంగా

హెచ్‌సీ కుటుంబానికి ఆర్థిక సహాయం


హెచ్‌సీ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు తదితరులు

డెంకాడ: రోడ్డు ప్రమాదంలో మరణించిన చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరాడ రామునాయుడు కుటుంబానికి పోలీస్ వాట్సాప్‌గ్రూప్ సభ్యులు రూ.లక్షా 50వేల 662ల ఆర్థిక సహాయం చేశారు. ఏపీ పోలీస్ వాట్సాప్ గ్రూపులోని సభ్యులు వితరణగా ఇచ్చిన మొత్తాన్ని మృతుడు హెచ్‌సీ రామునాయుడు కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు లెంక రాము, మిత్తిరెడ్డి అప్పలనాయుడు, శీర గణేష్, అక్కుపల్లి గోవింద, మజ్జి కూర్మారావు, గొర్లె శ్రావణ్‌కుమార్, మీసాల చంద్రమౌళి, కల్యాణపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

16న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా 16వ తేదీన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర క్విజ్ మాస్టర్ కర్రి రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 16వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.అన్ని రకాల పోటీ పరీక్షలు రాసేందుకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు . ఆరుగురు అభ్యర్థులు ఒక గ్రూప్‌గా ఏర్పండి పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. హైటెక్ విజయరహస్యం-2025 మ్యాగజైన్, ఇంగ్లీష్, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన గ్రూప్‌లకు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ 3వేలు, రూ.2వేలు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.ఈ పోటీలు గ్రామ మాజీ సర్పంచ్ తిక్కాన చిన్నదేముడు ఆర్థిక సహాయంతో నిర్వహించనున్నట్లు చెప్పారు.

9న జిల్లా స్థాయి యోగా పోటీలు

విజయనగరం: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల తోటపాలెం గాయత్రి టెక్నో స్కూల్‌లో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో 8 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ పేర్లను 8వ తేదీ సాయంత్రం లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు, మైసూర్ (కర్ణాటక)లో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు ఫోన్ 8374904262,7993696087 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చెక్‌బౌన్స్ కేసులో రెండేళ్ల జైలుశిక్ష

గజపతినగరం రూరల్: మిహిరా చిట్స్ యజమాని మక్కువ శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం పట్టణానికి చెందిన కింతాడ అప్పారావుకు చెక్‌బౌన్స్ కేసులో రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.రెండు లక్షలు నష్టపరిహారం విధిస్తూ గజపతినగరం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయ్‌రాజ్‌కుమార్ తీర్పునిచ్చారు. మిహిరా చిట్ కంపెనీకి అప్పారావు సకాలంలో చిట్ నగదు చెల్లించకపోవడం వల్ల ముద్దాయికి ఈ శిక్ష వేసినట్లు మెజిస్ట్రేట్ తీర్పులో పేర్కొన్నారు.

గిరిజన బాలుడి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కోటపాడు గ్రామానికి చెందిన కద్రక అభిరాం(13)అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి వరకు చదివిన అభిరాం టీబీ తదితర వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న కారణంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠశాలకు వెళ్లలేదు. తల్లి మాలతి, తండ్రి మహేష్ అభిరాంను వైద్యం నిమిత్తం పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్య సేవలు అందించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

గిరిజన రైతుల హక్కులు కాలరాస్తే సహించం

- సాగుచేసిన భూములు వారి స్వాధీనంలోనే ఉండాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర,
- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు
- కాకర్లవలస, కారేడువలసలో భూముల పరిశీలన


గిరిజన రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ఎన్నోఏళ్లుగా సాగులో ఉన్న భూములపై సర్వ హక్కులు గిరిజన రైతులవేనని వారి హక్కులను కాలరాస్తే సహించేది లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన రైతులు చాలా రోజులుగా భూసమస్యలపై పోరాడుతున్న సమాచారం తెలుసుకున్న వారు బుధవారం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయా భూములను పరిశీలించారు.ఈ భూముల్లో ఎప్పటి నుంచి సాగులో ఉన్నారు? మీ దగ్గర నుంచి తీసుకునేటప్పుడు మీకు నోటీసులు ఇచ్చారా లేదా? అని ఆరా తీస్తూ గిరిజన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏపీ ఐఐసీ అధికారులు, ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు కోసం పేదల పొట్టగొడుతూ మేము ఎన్నో ఏళ్లుగా కష్టపడి సాగుచేసుకుంటున్న పంటలు సైతం దౌర్జన్యంగా నాశనం చేయడంతో పాటు లాక్కుంటున్నారని గిరిజన రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు.అలాగే దశాబ్దాల కాలంగా మేము సాగులో ఉన్న ఇవే భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాటాలు చేస్తే రెవెన్యూ అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చారని వారి వద్ద గిరిజన రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ అధికారం ఉపయోగించి పోలీసుల సహకారంతో దౌర్జన్యంగా చేసి గిరిజనులను భయపెట్టడం సమంజసం కాదన్నారు. ఆరుగాలం కష్టపడి పెంచుకుంటున్న మామిడి తోటలు, జీడి తోటలు, మొక్కజొన్న, పత్తి పంటలు ధ్వంసం చేయడానికి ఏపీఐఐసీ అధికారులకు మనసు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. తాము అభివృద్ధికి అడ్డుకాదని, ప్రభుత్వ ప్రయోజనాలు, ప్రజాప్రయోజనాల కోసమో సాగుభూముల్లో పనులు చేస్తే పద్ధతిని పాటిస్తూ ముందుకెళ్లాలన్నారు.


తమ గోడు వినిపించుకునేందుకు పెద్ద ఎత్తున హాజరైన గిరిజన రైతులు

పాలన ఇలాగేనా?

ఇక్కడ పంచాయతీ సర్పంచ్‌కు గాని, గిరిజన రైతులకు కానీ కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా లాక్కుంటారని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని,గిరిజన ప్రజలకు మంచి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఇలాగేనా పాలించేది అని ప్రశ్నించారు. 2009లో వనసంరక్షణ కింద అప్పటి కలెక్టర్ వీర బ్రహ్మయ్య గిరిజనులకు పట్టాలు ఇచ్చారని,అప్పటికే ఎన్నో ఏళ్ల నుంచి బీడు భూములను బాగు చేసుకుని గిరిజన రైతులు సాగులో ఉంటే ఇప్పుడు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. గిరిజన రైతులేమీ దొంగతనంగా ఆక్రమించుకోలేదన్నారు. దౌర్జన్యంగా ధ్వంసం చేసిన పంటలకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు గిరిజన రైతులకు కొండ ప్రాంతంలో కాకుండా ఈ భూములకే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్ మజ్జి రాంబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్ సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెనిద్రతో ప్రజలకు భరోసా

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా 'పల్లె నిద్ర' కార్యక్రమం చేపట్టామని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ప్రతి నెలలో రెండు గ్రామాల్లో 'పల్లె నిద్ర' చేయాలని ఎస్సైలు, సీఐలను ఆదేశించామని ఎస్పీ అన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, వివిధ నేరాలు, చట్టాల మీద అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోగల గ్రామం లేదా వార్డులో ఎస్సై లేదా సీఐ స్థాయి అధికారులు, దత్తత గ్రామాల కానిస్టేబుల్స్ 'పల్లె నిద్ర' చేపట్టే విధంగా అధికారులను ఇప్పటికే ఆదేశించామని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. 'పల్లె నిద్ర' కార్యక్రమంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతున్నామన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల సహకారంతో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడమే 'పల్లె నిద్ర' ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 300 గ్రామాల్లో పోలీసు అధికారులు కార్యక్రమం చేపట్టారని తెలిపారు.


పల్లెనిద్ర వివరాలు చెబుతున్న ఎస్పీ వకుల్ జిందల్

వృద్ధుడి అదృశ్యం


అదృశ్యమైన పతివాడ కాశయ్య

విజయనగరం క్రైమ్ : నగరంలోని ఇందిరానగర్ లో నివాసముంటున్న పతివాడ కాశయ్య (69) అదృశ్యమైనట్లు బుధవారం విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదైంది. కాశయ్య కొడుకు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెచ్‌సీ అప్పలనాయుడు కేసు నమోదు చేయగా సీఐ ఆర్‌వీకే చౌదరి దర్యాప్తు ప్రారంభించారు.గత నెల 23న ఇంటి నుంచి వెళ్లిపోయిన కాశయ్య ఇప్పటివరకు ఇంటికి తిరిగాలేదని కొడుకు తిలక్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా కాస్త మతిస్థిమితం లేదని ఇంట్లో గొడవపడి గత నెలలోనే ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. క్రైమ్ పార్టీ కాశయ్య కోసం వెతుకులాట చేపట్టారని సీఐ చౌదరి ఈ సందర్భంగా చెప్పారు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


రైల్వే ప్లాట్ ఫాంపై గుర్తుతెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబర్ 5పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం జీఆర్పీ సిబ్బంది గమనించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఉంటుందని సుమారు ఆరడుగుల ఎత్తు, సిమెంట్ రంగు షర్ట్ , నీలిరంగు ఫ్యాంట్ ధరించిన వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నామని జీఆర్పీ హెచ్‌సీ అశోక్ తెలిపారు. మృతుడి కుడి చేతికి ఎర్రటి తాడు ఉందని సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే ఫోన్ 9490617089, 6301365605 నంబర్లకు కానీ ల్యాండ్ లైన్ 08912883218 నంబర్‌కు కాని ఫోన్ చేయాలని హెచ్‌సీ అశోక్ తెలిపారు.

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం లీగల్: జాతీయ లోక్ అదాలత్‌ను చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీలు, జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కోర్టు సముదాయంలో ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీల బ్యాంక్ మేనేజర్లు, బ్యాంకులకు సంబంధించిన అధికారులు, కంపెనీ న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్ కంపెనీలకు, బ్యాంక్‌కు సంబంధించిన కేసులను సెప్టెంబర్ 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న బ్యాంకు దావాలను ఎక్కువ కేసులను రాజీ చేయాలని కంపెనీలకు సంబంధించిన బ్రాంచ్ మేనేజర్, బ్యాంక్ మేనేజర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్, మార్గదర్శి చిట్‌ఫండ్స్, కపిల్ చిట్‌ఫండ్స్ శ్రీరామ్ చిట్‌ఫండ్స్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

ఉపాధికోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..!

- మేడపై నుంచి జారిపడి యువకుడి మృతి
- హైదరాబాద్‌లో ప్రమాదం


సందీప్ (ఫైల్)

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి జంగాలవీధిలో నివాసముంటున్న దేవళ్ల శంకరరావు, ఉషారాణి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సందీప్(24) హైదరాబాద్ లో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సందీప్ డిగ్రీ వరకూ చదువుకున్నాడు. ఉపాధి మార్గంలో భాగంగా తనకు ఇష్టమైన హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం ఉద్యోగ అన్వేషణలో హైదరాబాద్ చేరాడు. అక్కడి జూబ్లీహిల్స్‌లో గల ఓ కేఫ్‌లో కొలువు పొందాడు. కొడుకు అందుకొస్తున్నాడని తల్లిదండ్రులు భావిస్తున్న తరుణంలో విధి కన్నుకుట్టింది. కేఫ్ యాజమాన్యం సమకూర్చిన మూడంతస్తుల భవనంలో వసతి పొందుతున్న సందీప్ బుధవారం ఉదయం 5 గంటల సమయంలో భవనం పైనుంచి జారి పడిపోయాడు. ఈ విషయాన్ని సందీప్ సహచరులు పాలకొండలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. విషయం తెలుసుకుని ఉలిక్కిపడిన వారు హుటాహుటిన హైదరాబాద్ పయనమయ్యారు. సందీప్ తలకు గాయం కావడంతో గాంధీ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్నట్లు సహచరులు తెలియజేయడంతో కంగారు పడ్డారు. ఇంతలో సందీప్ తుదిశ్వాస విడిచాడన్న వార్త తెలియగానే షాక్‌కు గురైనట్లు తండ్రి శంకరరావు తెలిపాడు. తాను టైలరింగ్ చేస్తూ, తన భార్య మెప్మాలో అత్యంత చిన్న ఉద్యోగం చేస్తూ రెక్కల కష్టంపై పిల్లలను అల్లారు ముద్దుగా పెంచామని, వారి భవిష్యత్తు కోసం కన్న కలలు తీరకుండానే తిరిగిరాని లోకానికి చెయ్యెత్తు కొడుకు వెళ్లిపోయాంటూ తల్లిదండ్రులు రోదించారు. ఈ విషయం తెలియడంతో స్థానిక జంగాల వీధితోపాటు మృతుని బంధువులు, స్నేహితుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.


తలకు బలమైన గాయంతో సందీప్

అయిన వారు వదులుకున్నారు,.108 సిబ్బంది ఆదుకున్నారు

కొత్తవలస: కష్టపడి పని చేసి కుటుంబాన్ని పోషించిన వ్యక్తి అవసరం తీరిపోవడంతో అయిన వారు వదులుకున్నారు. అయితే ఆ వ్యక్తిని 108 సిబ్బంది ఆదుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఒక వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడని స్థానికులు 108 వాహనం సిబ్బందికి సమాచారం అందించారు.దీంతో 108 వాహనం సిబ్బంది టెక్నీషయన్ సీహెచ్.సన్యాసినాయుడు, పైలెట్ విజయ్‌కుమార్‌లు 108 వాహనంలో వచ్చి పరిశీలించగా ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే ప్రథమ చికిత్స నిర్వహించి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడికి వెళ్లేసరికి సంబంధిత వ్యక్తికి మెలకువ రావడంతో వివరాలు అడగ్గా తాను ఉప్పల వెంకటరావును. కారు డ్రైవర్‌నని తెలిపాడు. భార్య,ఇద్దరు ఆడపిల్ల లు ఉన్నారని, పిల్లలకు పెళ్లిళ్లు జరిపించినట్లు తెలిపాడు. తాను అనారోగ్యం పాలుకావడంతో కుటుంబసభ్యులు చిన్నచూపు చూడడంతో అక్కడక్కడ తింటూ రోడ్డుపైనే కాలక్షాపం చేస్తున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఆ వ్యక్తి పరిస్థితి నిలకడగా ఉందని ఆయన బంధువులకు సమాచారం అందించామని 108 సిబ్బంది తెలిపారు.


108 వాహనంలో బాధితుడు వెంకటరావుకు చికిత్స నిర్వహిస్తున్న టెక్నీషయన్ సన్యాసినాయుడు

పాము కాటుతో రైతు మృతి

భామిని: మండలంలోని పెద్దదిమిలికి చెందిన రైతు బలగ నారాయణరావు(40) బుధవారం పాము కాటుకు గురై మృత్యువాత పడ్డాడు. గ్రామ సమీపంలో వేసిన కూరగాయల పొలం నుంచి కూరగాయలు తెస్తుండగా దారిలో పాముకాటుకు గురయ్యాడని స్థానికులు తెలిపారు. గాయపడిన నారాయణరావు(40) తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో సాటి రైతులు హుటాహుటిన ఆటోలో కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.


ఆస్పత్రిలో నారాయణ రావు మృతదేహం

మహిళ అరెస్టు

పూసపాటిరేగ: అనధికార మద్యం దుకాణాలపై (బెల్ట్ షాపులపై) దాడుల్లో భాగంగా పూసపాటిరేగ మండలం గొతుల చోడవరం గ్రామం మైలాన్ జంక్షన్ దరిలో ఒక మహిళను తొమ్మిది మద్యం బాటిల్స్‌తో అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెల్ట్ షాపులు నిర్వహించరాదని, ప్రోత్సహించరాదని కోరారు. బెల్ట్ షాపుల సమాచారాన్ని భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కి తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్, కానిస్టేబుల్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో మొత్తం పీఏసీఎస్‌లు 42
- 18 సొసైటీలకు గతంలో త్రీమెన్ కమిటీ నియామకం
- మిగిలిన 24 సొసైటీల్లో కొలిక్కిరాని కమిటీలు
- 24 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం


పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించిన వీరఘట్టం పీఏసీఎస్

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పీఏసీఎస్‌లలో నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు చోట్ల సొసైటీల్లో త్రీమెన్ కమిటీ నియామకాలకు కూటమిలో ఏర్పడిన కుమ్ములాటలతో పీఏసీఎస్‌లో చైర్మన్ కుర్చీలు ఖాళీగా మిగిలాయి. ముఖ్యంగా జిల్లాలోని పాలకొండ, పార్వతీపురం డివిజన్లలో ఈ నియామకాలు ఆగిపోయాయి. మిగిలిన చోట్ల నెల రోజుల క్రితమే త్రీమెన్ కమిటీలను ఎమ్మెల్యేల సిఫార్సులతో నియమించారు. చైర్మన్ కుర్చీలు ఖాళీగా ఉన్న చోట ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 1న ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను ఈ సొసైటీలకు నియమించింది. ఆరు నెలల పాటు 2026 జనవరి 30 వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు ఇక్కడ ప్రత్యేకాధికారులుగా వ్యవహరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో చాలా రోజులుగా పీఏసీఎస్‌లలో చైర్మన్ పదవి వస్తుందని ఆశించిన వారికి నిరాశే మిగిలిందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 42 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఏసీఎస్‌లలో నియమించిన త్రీమెన్ కమిటీలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 జూన్ 28న స్వచ్ఛందంగా తప్పుకున్నారు.దీంతో గత 14 నెలలుగా పీఏసీఎస్‌లలో త్రీమెన్ కమిటీలు లేక పాలన గాడి తప్పుతోంది. ఈ క్రమంలో గతేడాది అన్ని సొసైటీలకు ఆరు నెలల పాటు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. తొలుత పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలని ఆలోచన చేసిన ప్రభుత్వం తర్వాత నామినేటెడ్ పద్ధతిలో త్రీమెన్ కమిటీలను నియమించాలని ఆలోచన చేసింది. దీంతో జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సులతో 18 పీఏసీఎస్‌లకు నెలరోజుల క్రితం త్రీమెన్ కమిటీలు నియమించారు. చైర్మన్ పదవి కోసం అటు టీడీపీ, ఇటు జనసేన నేతల మధ్య పోటీ ఏర్పడడంతో జిల్లాలో 24 పీఏసీఎస్‌లలో త్రీమెన్ కమిటీ నియామకాల కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు కుస్తీ పడుతున్నారు. ఇంతలో ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆశావహులు కంగుతిన్నారు.

24 పీఏసీఎస్‌లకు ప్రత్యేధికారులు..

పాలకొండ నియోజకవర్గంలో 8 పీఏసీఎస్‌లు ఉండగా ఇక్కడ ఏ ఒక్క సొసైటీలో కూడా త్రీమెన్ కమిటీలను నియమించలేకపోయారు. ముఖ్యంగా ఇక్కడ ఉన్న జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు, టీడీపీ ఇన్‌చార్జ్ భూదేవిల మధ్య సయోధ్య కుదరకపోవడంతో సొసైటీల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయలేకపోయారని అందరూ చర్చించుకుంటున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలోని భామిని, బత్తిలి, అర్దలి, బాసూరు, పాలకొండ, ఆర్‌బీఆర్.పేట, తంపటాపల్లి, వీరఘట్టంలో త్రీమెన్ కమిటీలు వేయలేదు. అలాగే పార్వతీపురం డివిజన్‌లోని గరుగుబిల్లి, చినమేరంగి, కృష్ణపల్లి, పలగర, గలావిల్లి, అజ్జాడ, బూర్జ, సీతానగరం, కాశీపేట, గెద్దలుప్పి, పార్వతీపురం, తామరఖండి, అంటిపేట, ఆర్.వెంకమ్మపేట, మరిపివలస, పాపమ్మవలస సొసైటీలకు కూటమి నాయకులు త్రీమెన్ కమిటీలను వేయకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది.


ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు

ప్రత్యేకాధికారులను నియమించారు

జిల్లాలో త్రీమెన్ కమిటీలు లేని 24 సొసైటీలకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది.వచ్చే ఏడాది జనవరి 30 వరకు ఇన్‌చార్జ్‌లు ఉంటారు.ఒక వేళ ఇంతలో త్రీమెన్ కమిటీలు వస్తే పర్సన్ ఇన్‌చార్జ్‌లు మరి ఉండరు.

పి.శ్రీరామమూర్తి, జిల్లా కోపరేటివ్ అధికారి

దేశ రాజధాని పెద్దల దృష్టికి
జిందాల్ సమస్య

శృంగవరపుకోట: భూములు కోల్పోయి ఉపాధి కరువై రోడ్డున పడిన జిందాల్ పరిశ్రమ నిర్వాసితుల గోడును దేశరాజధానికి తీసుకెళ్లామని ఎమ్మెల్సీ రఘురాజు చెప్పారు. ఈ మేరకు బుధవారం బొడ్డవరలో ఆయన తన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 45రోజులు రైతులు రోడ్డున పడి ఆందోళన చేస్తుంటే స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, రాష్ట్ర సర్కారులో కనీస స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యకు పరిష్కారం చూపాలని, ఢిల్లీలో జాతీయ మానవహక్కుల సంఘం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ల చైర్మన్లను కలిసి జిందాల్ రైతాంగ సమస్యలు వివరించామన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇప్పటికే 15 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసి ఆర్ అండ్‌ఆర్ అమలులో జరిగిన లోపాలు, చెల్లింపుల్లో తప్పిదాలను వివరించామన్నారు. జిందాల్ నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.


జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిశోర్ మఖానాను కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

నిందితుడి కోసం తీవ్ర గాలింపు

- సవాల్‌గా తీసుకున్న పోలీసులు

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామంలో నాటు తుపాకీతో తన సమీప బంధువును మంగళవారం సాయంత్రం కాల్చి పరారైన నిందితుడు సిమ్మ అప్పారావు (35) ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఈ మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావును అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలసకు చెందిన సిమ్మ అప్పారావు మంగళవారం తుపాకీతో కాల్చి చంపిన విషయం పాఠకులకు విదితమే. నిందితుడు అప్పారావు తుపాకీతో కాల్చి తోటల్లోంచి పరిగెత్తుకుంటూ పోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి పరుగెత్తుకుంటూ అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం గొట్లాం గ్రామం రోడ్డువరకు ద్విచక్రవాహనంపై వెళ్లి అక్కడ బండి దిగి ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావును తుపాకీతో కాల్చి చంపేశానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడని నిందితుడి చిన్నాన్న తెలిపాడు. కాగా తోటల్లోంచి వచ్చిన సమయంలో నిందితుడి వద్ద తుపాకీ లేదని తెలిపాడు. తుపాకీని తోటలోనే ఎక్కడో పడేశాడని పోలీసులు అంచనాకు వచ్చి వెతికేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. ఉదయం నుంచి గ్రామం సమీపంలో గల జీడి, మామిడితోటల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. పలు గ్రామాల్లో గల నిందితుడి బంధువుల ఇళ్లల్లోను తనిఖీ చేశారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా నిందితుడికి హెవీ వెహికల్ డ్రైవర్‌గా పని చేసిన అనుభవం ఉండడంతో గొట్లాం జంక్షన్ నుంచి ఇతర ప్రాంతానికి వెళ్లి పోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు మాత్రం ఈ కేసు సవాల్‌గా మారింది. కాగా మృతుడు సిమ్మ అప్పారావు కుమారుడు అంజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని సీఐ షణ్ముఖరావు తెలిపారు.


నిందితుడు సిమ్మ అప్పారావు